# వెండితెర వెనుక

## సత్తిబాబు





గత ౩౫ సంవత్సరాలుగా తెలుగు సినీరంగంలో దర్శకత్వశాఖలో విశేషమైన అనుభవం ఉన్న రచయిత కలం నుంచీ
1978 ప్రాంతాల్లో మద్రాసులోని తెలుగు చలనచిత్ర రంగానికి అద్దం పట్టే ధారావాహిక నవల.

*(గతసంచిక నుంచీ కొనసాగింపు..)*

"నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను జయా" అనే క్లోజ్ షాట్ని.. షాట్ - కట్ చెప్పాను! జీవితంలో ఇదో అనుకోని మలుపు! మొదటి రోజు షూటింగ్‌లో వెయ్యికళ్ళు నన్ను పరీక్షిస్తాయని తెలుసు! నేను భయపడాల్సిందేమీలేదు. స్క్రిప్టు మీద నాకు ఫుల్ కమాండ్ ఉంది. మొదటిరోజు షూటింగుకు వచ్చిన పెద్దలు భుజం తట్టివెళ్ళారు. హీరో, హీరోయిన్ల మధ్య ప్రేమ సన్నివేశాలు చాలా చక్కగా వర్కవుట్ చేసారు శంకరంగారు. సినిమాలో హీరోయిన్ పేరు జయ! ప్రేమ సన్నివేసాలు తీసేటప్పుడు చాలా ఎమోషనల్‌గా ఫీలయేవాణ్ణి! హీరోయిన్ స్థానంలో జయ నవ్వుతూ నిలబడేది. 'రష్' చూసిన ప్రతి ఒక్కరూ సున్నితమైన ప్రేమను అతి సున్నితంగా తీసానని" అన్నారు.

ఏ అవాంతరాలు లేకుండా ఇండోర్ షూటింగ్ అంతా అయిపోయింది. అవుట్‌డోర్ సాంగ్స్‌కి అరకువాలీ బదులు, ఊటీ వెళ్ళాం! పిక్చర్ మొత్తం అయిపోయింది. రషంతా ఎడిట్ చేసి, డబ్బింగ్ చేసేసాం! వెంటనే ఆర్. ఆర్. కాపీ వచ్చింది. రీ రికార్డింగ్ - మిక్సింగ్ అయిపోయింది ఫస్ట్ కాపీ వచ్చింది. పిక్చర్ చూసిన ప్రతి ఒక్కరూ "పిక్చర్ చాలా బాగుంది. అన్ని ఏరియాలు అమ్మకుండా కొన్ని చేతిలో పెట్టుకోండి. మంచి లాభాలొస్తా"యన్నారు. 'వేరే పెద్ద డైరెక్టర్ని పెట్టకుండా మంచి పని చేసావు ధర్మారావ్! కుర్రాడు శంకరం కంటే బాగా చేసాడు.' అన్నారొక ఇండస్ట్రీలో స్టాల్‌వార్ట్!

ధర్మారావుగారు పొంగిపోయారు. నా డైరెక్షన్‌లోనే ఇంకొక పిక్చర్ ఎనౌన్స్ చేసారు.

"శంకరంగారు పోయేముందు. ప్రతిసీను విపులంగా డిస్కస్ చేసారు! ఆయన భావాల అడుగుజాడల్లోనే నడిచి, పిక్చర్ పూర్తిచేసాను. నేను తీసింది ఫిల్మ్ మాత్రమే. దానిలోని ఆత్మ శంకరంగారిది" అని స్టేట్‌మెంట్ ఇచ్చాను.

ఏరియాలు మంచి రేటుకు అమ్ముడుపోయాయి. అప్పులన్నీ తీర్చగా మూడు లక్షలూ, రెండు ఏరియాలూ ధర్మారావుగారికి మిగిలాయి.

రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకోవడానికి డిస్ట్రిబ్యూటర్లు మరునాడు వస్తున్నారు. ధర్మారావుగారు తనింట్లో 'లంచ్' ఏర్పాటు చేసారు.

లంచ్ అయిన తర్వాత అన్ని విషయాలు మాట్లాడుకుందాం అన్నారు. మర్నాడు ధర్మారావుగారింటికి వెళ్ళాను! ఆయన లోపలున్నారు. సోఫాలో కూర్చుని పేపరు చదువుతున్నాను.

"కాఫీ సర్..."

కాఫీ తీసుకోబోతూ తలెత్తి చూసాను. నా చేతులు అలాగే ఉండిపోయాయి!

"కాఫీ... సార్"

"గగన్ కుమార్... నువ్వు... మీరు."

"కాఫీ తీసుకోండి సార్! చల్లారి పోతుంది"

నా చేతుల్లో ఎందుకో అనుకోని షేకింగ్ వచ్చింది. గగన్‌కుమార్ కప్పు సాసర్ అందించాడు. కప్పు మా ఇద్దరి చేతుల్లోంచీ జారి, నా తెల్లటి ఫాంటు మీదనుంచీ నేలమీద పడింది. గగన్‌కుమార్ కంగారుపడుతూ నా ఫాంట్‌ను నేప్‌కిన్‌తో శుభ్రం చేస్తూ "సారీ - సర్ చేతులు వణికాయి" అన్నాడు. నేను సమాధానం చెప్పేలోగా ధర్మారావుగారు విసురుగా వచ్చి, గగన్‌కుమార్‌ని దవడమీద కొట్టారు! నేను అవాక్కయి నిలబడిపోయాను!

"వెధవా! డైరెక్టర్ గారనే గౌరవం లేకుండా... అంత కేర్‌లెస్సా!... నిన్నూ..." అని మరల చెయ్యెత్తగానే, నేను ఆ చేతిని పట్టుకుని ధర్మారావుగారూ...." అన్నాను.

"నువ్వూరుకో రంగబాబూ! వీడికి పెద్దఫోజు. చాలా రోజుల్నుంచీ చూస్తున్నాను. పనిచేసేటప్పుడు ఫేంటు మడత నలగనీడు! వీడు చేసేది బోయ్ ఉద్యోగం! పెద్ద హీరోలా ఫోజు..ఫోజని"

గగన్ కుమార్ మెడమీద చెయ్యిపెట్టి ఒక్క గెంటు గెంటారు! గగన్ కుమార్ వెల్లకిలా కార్పెట్ మీద పడ్డాడు. ధర్మారావుగారు మరలా అతన్ని పట్టుకోబోయారు.

"ధర్మారావుగారు! ప్లీజ్... అందులో అతని తప్పేమీ లేదు"

"ఏంటి రంగబాబూ... పనోడి మీద అంత జాలి... రేయ్! ఇక్కడినుంచీ వెంటనే వెళ్ళిపో.. లేకపోతే..." అంటూ రొప్పుతూ సోఫాలో కూలబడ్డారు.

గగన్‌కుమార్ చెంపమీద చెయ్యిపెట్టుకుని భారంగా వెళ్ళిపోయాడు. వెడుతున్నప్పుడు నా వైపు దీనంగా ఒక్క చూపు చూసాడు. ఆ చూపు వెనకాల కళ్ళల్లో ఉబుకుతున్న కన్నీళ్ళు గమనించాను.

"కూర్చో రంగబాబూ! లుంగీ కట్టుకుంటావా?"

"వద్దు సార్, ఫర్వాలేదు"

"వచ్చే డిస్ట్రిబ్యూటర్లు కుర్రకుంకలు! ఆ ఫేంటు చూసి - అది ఫేషననుకుని వెంటనే వాళ్ళ ఫేంట్ల మీద కాఫీ ఒలకబోసుకున్నా ఒలకబోసుకుంటారు," అని హాలు దద్దరిల్లేటట్లు నవ్వారు.

ఆయన నవ్వుతాడు.. ఇండస్ట్రీ అంతా పిక్చరు వంద రోజులు గ్యారంటీ అంటున్నారు! ఈయన చెప్పిన రేటుకి మిగిలిన ఏరియాలు కూడా కొంటానికి పార్టీలు తెగతిరుగుతున్నారు. సామాన్య వ్యక్తిలో బాధను గుర్తించే పరిస్థితి కాదిది!

✡✡✡

-తరువాయి భాగం వచ్చే సంచికలో-